క్లుప్తంగా

కాలభైరవుడికి విశేష పూజలు



ముండ్లపాడు క్రాస్‌రోడ్(పెనుగంచిప్రోలు): మండలంలోని ముండ్లపాడు క్రాస్‌రోడ్స్ వద్ద వేంచేసి ఉన్న శ్రీకాశీ కాలభైరవస్వామి వారి ఆలయంలో ఆషాఢమాసం ఆదివారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ప్రదోష కాలంలో అర్చకులు పూజా కార్యక్రమలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అన్నపూర్ణేశ్వరాలయంలో ఎమ్మెల్యే పూజలు



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని పాలేటి తీరాన ఉన్న కాశీ అన్నపూర్ణేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన అభిమాని రాయపూడి శ్రీకాంత్ కాశీ అన్నపూర్ణేశ్వరస్వామి వారి ఆలయంలో 101 కొబ్బరికాయలు కొడతానని మొక్కుకున్నందున ఆయన కోరిక మేరకు ఆలయానికి వచ్చిన తాతయ్య ముందుగా కొబ్బరికాయను కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీడీపీ నాయకులు స్వామివారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

నేటి నుంచి శ్రావణమాస ఉత్సవాలు



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ముత్యాలమ్మ బజారులో వేంచేసియున్న శ్రీముత్యాలమ్మ అమ్మవారి శ్రావణ మాస ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అప్పన మణికుమార్, కొత్తా రమేష్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఈ ఉత్సవాలు సెప్టెంబర్ 2 వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ప్రతి ఆదివారం, గురువారాలు భక్తులచే మేళతాళాలతో జాతర, బోనాలు సమర్పణ కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు నోముల శివ కుమార్, సంయుక్త కార్యదర్శి కొంకిమళ్ల సురేష్, కోశాధికారి అప్పన వెంకట పిచ్చయ్య వివరించారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కంచికచర్ల : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ పి.జాహ్నవి తెలిపారు. ప్రజల నుంచి ఆయా సమస్యలపై అర్జీలు స్వీకరించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయాలని తహశీల్దార్ కోరారు.

రక్తనాళాల వ్యాధులపై అవగాహన అవసరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): మారుతున్న జీవనశైలి కారణంగా రక్తనాళాల వ్యాధులు పెరుగుతున్నాయని, వాటిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని పలువురు వాస్క్యులర్ సర్జన్స్ అన్నారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, క్రమం తప్పకుండా వ్యాయామం, నడక, యోగా వంటి వాటితో వ్యాధుల బారిన పడకుండా చూడవచ్చునని వారు పేర్కొన్నారు. ఈనెల 6 జాతీయ వాస్క్యులర్ డేను పురస్కరించుకుని వాస్క్యులర్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీశాఖ ఆధ్వర్యంలో రక్తనాళాల వ్యాధులపై అవగాహన కలిగించేందుకు ఆదివారం వాక్‌థాన్ నిర్వహించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద నిర్వహించిన ఈ వాక్‌థాన్‌ను ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈఓ లక్ష్మీశా జెండా ఊపి ప్రారంభించారు.

వ్యాయామం తప్పనిసరి..

ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ మాకినేని కిరణ్, డాక్టర్ శివకృష్ణ, డాక్టర్ రత్నశ్రీలు మాట్లాడుతూ రక్తనాళాల జబ్బులు, వాటి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు చికిత్సల గురించి ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఈ వాక్‌థాన్ నిర్వహిస్తున్నామన్నారు. మందులు వేసుకుంటే వ్యాధి తగ్గిపోతుందని అందరూ భావిస్తారని, వ్యాధి తగ్గాలంటే మందులతో పాటు మన వైపు కృషి చేయాలన్నారు. వ్యాయామం, ఆహార నియమాలు పాటిస్తే కాళ్లు నల్లబడటం, గుండె జబ్బులు, పక్షవాతం వచ్చే రిస్క్ తగ్గుతుందన్నారు. నూనె, వేపుడు, కొవ్వు పదార్థాలు తగ్గిస్తే వ్యాధి రాకుండా నియంత్రించవచ్చునన్నారు. ఉబ్బిన సిరలు రాకుండా ఉండాలంటే వ్యాయామం చేయడం, ఒకేచోట నిలబడకుండా పనిచేయడం, స్థూలకాయం తగ్గించుకోవడం చేయాలని సూచించారు.

పాఠశాలల్లో సమస్యల పాఠాలు

- అందరికీ అందని విద్యాకానుక..
- ఖాళీగా ఉపాధ్యాయ పోస్టులు
- టీడీపీ కూటమి నేతల కుట్రలకు పలు కుకింగ్ ఏజెన్సీలు బలి



మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

సాక్షి గ్రౌండ్ రిపోర్టు

జగ్గయ్యపేట/పెనుగంచిప్రోలు/వత్సవాయి/జగ్గయ్యపేట అర్బన్/వీరులపాడు: గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో కార్పొరేట్ విద్యావ్యవస్థకు ధీటుగా విద్యను అందించిన ప్రభుత్వ పాఠశాలలు ఈ విద్యాసంవత్సరం పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. విద్యా కానుక కిట్ల పంపిణీ, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, మౌలికసదుపాయాల కల్పన తదితర కారణాలతో పాఠశాలల్లో ప్రవేశం కోసం తీవ్రమైన పోటీ ఉండేది. సీట్లు దొరకక చాలామంది ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయించారు. ఆయా ప్రభుత్వ స్కూళ్లలో సీట్లు ఖాళీలేవని బోర్డులు పెట్టిన వైనం కూడా విదితమే. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేస్తుండటంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

పూర్తిస్థాయిలో అందని విద్యాకానుక..

గతంలో పాఠశాల మొదటిరోజునే విద్యాకానుక కిట్లను విద్యార్థులందరికీ అందించగా, ఈ ఏడాది ఇప్పటివరకు అందరికీ విద్యాకానుక కిట్లు అందించలేదు. నూతనంగా పాఠశాలల్లో చేరిన వారికి కిట్లు ఇంకా అందని పరిస్థితి ఉంది. జగ్గయ్యపేట నియోజకవర్గంలో మొత్తం 135 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా విద్యార్థులు 13,660మంది ఉన్నారు. నియోజకవర్గంలోని విద్యార్థులందరికీ విద్యాకానుక కిట్లు అందలేదు. ఇంకా 500 మంది విద్యార్థుల వరకు ఈ కిట్లు అందాల్సి ఉంది. నూతనంగా పాఠశాలల్లో చేరిన వారికి ఈ కిట్లు అందలేదని, ఇందుకోసం అవసరమైన ఇండెంట్ పెట్టినట్లు విద్యాశాఖాధికారులు చెబుతున్నారు.

ఉపాధ్యాయుల కొరత..

ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పెనుగంచిప్రోలు మండలంలో 9, జగ్గయ్యపేట మండలంలో 6, వత్సవాయి మండలంలో ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీరులపాడు, అల్లూరు జెడ్పీ పాఠశాలల్లో హిందీ టీచర్ పోస్టులు, వెల్లంకి పాఠశాలలో తెలుగు, ఇంగ్లిష్ టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఉపాధ్యాయ బదిలీలు ప్రక్రియను టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నిలిపివేయటంతో ఖాళీలు అలానే ఉన్నాయి. ఉపాధ్యాయుల పోస్టుల కొరత కారణంగా ఇతర ఉపాధ్యాయులపైనా భారం పడుతోంది.

కుకింగ్ ఏజెన్సీల తొలగింపు..

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందిస్తున్నా వంట ఏజెన్సీ నిర్వాహకుల తొలగింపు వ్యవహారం పలు గ్రామాల్లో వివాదాలకు దారితీస్తోంది. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ రెండు నెలల్లో పెనుగంచిప్రోలు మండలంలోని కొల్లికూళ్ల జెడ్పీ హైస్కూల్, వత్సవాయి మండలం మంగొల్లు గ్రామంలో జెడ్పీ-1, ప్రాథమిక పాఠశాల-1, భీమవరం జెడ్పీ-1, ప్రాథమిక పాఠశాల-1, గంగెల్లి ప్రాథమిక పాఠశాల-1, పోచారం ప్రాథమిక పాఠశాల-1, జగ్గయ్యపేట మండలం జయంతిపురం యూపీ పాఠశాల వంట ఏజెన్సీల నిర్వాహకులను నుంచి తొలగించారు. మరికొన్ని పాఠశాలల్లో కూడా తొలగించే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఆస్థానంలో టీడీపీ కూటమికి చెందిన వ్యక్తులకు ఏజెన్సీ బాధ్యతలు అప్పగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కుకింగ్ ఏజెన్సీల నుంచి తొలగింపునకు గురై ఇబ్బందులుపడుతున్నవారి అభిప్రాయాలు.. వారి మాటల్లోనే...

కుకింగ్ ఏజెన్సీలపై కక్షసాధింపు.



కుకింగ్ ఏజెన్సీల నిర్వాహకులను తిరిగి తీసుకోవాలని కోరుతూ డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాలు

నందిగామ టౌన్: టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చిరుద్యోగులను తొలగిస్తూ కక్ష సాధింపుకు చర్యలకు పాల్పతోంది. ముఖ్యంగా పాఠశాలల్లో ఎన్నో ఏళ్లుగా మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులుగా పనిచేస్తున్న వారిని తొలగించేందుకు కుయుక్తులు పన్నుతోంది. నందిగామ పట్టణంతోపాటు మండలంలో 69 మధ్యాహ్న భోజన పథకం కుకింగ్ ఏజెన్సీలుండగా చందర్లపాడు మండలంలో 40ఏజెన్సీలు ఉన్నాయి. వీటిలో ఐతవరం, కేతవీరునిపాడు, పెద్దవరం, సోమవరం గ్రామాల్లోని కుకింగ్ ఏజెన్సీల నిర్వాహకులకు టీడీపీ కూటమి నాయకులు తొలగించారు. మిగిలినవారిని కూడా తొలగించేందుకు కుట్రలు పన్నుతున్నారు. తొలగించిన కుకింగ్ ఏజెన్సీల నిర్వాహకులుగా టీడీపీ వారిని నియమించేందుకు యత్నిస్తున్నట్లు సమాచారం.

ప్రభుత్వ తీరుపై సంఘాల నిరసన..

కుకింగ్ ఏజెన్సీలు, విలేజ్ బుక్ కీపర్లను తొలగింపుపై పలు ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా కుకింగ్ ఏజెన్సీలను నిర్వహిస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందిస్తున్న కుకింగ్ ఏజెన్సీల నిర్వాహకులను తొలగించడం తగదంటూ సీఐటీయూ తదితర సంఘాలు ప్రభుత్వం తీరును తప్పుపడుతున్నాయి. ఈ మేరకు ఉన్నతాధికారులకు కలసి వినతిపత్రాలు కూడా అందజేస్తూ, ఆయా కుకింగ్ ఏజెన్సీలను తొలగించవద్దని డిమాండ్ చేస్తున్నాయి. దశాబ్దకాలానికి పైగా కుకింగ్ ఏజెన్సీలను నిర్వహిస్తున్నవారిని తొలగించాలనుకోవడం దారుణమని నియోజకవర్గ ప్రజలు మండిపడుతున్నారు. పాలకులు ఇకనైనా ఇటువంటి చర్యలు మానుకోవాలని వారు హితవు చెబుతున్నారు.

ఏళ్ల తరబడి పనిచేస్తున్నా..



కొల్లికూళ్ల జెడ్పీ హైస్కూల్‌లో 15ఏళ్లకు పైబడి మధ్యాహ్న భోజన పథక వంట ఏజెన్సీ కార్మికురాలిగా పనిచేస్తున్నాను. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్ధాంతరంగా నన్ను తొలగించారు. కారణం లేకుండా తొలగించడం బాధేస్తోంది. మాగ్రామంలో నాతో పాటు మరొకరిని కూడా తొలగించారు.

-కాసరెల్లి లక్ష్మి, కొల్లికూళ్ల

దౌర్జన్యంగా వెళ్లగొట్టారు ..



పాఠశాలలో 15ఏళ్లుగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండిపెడుతున్నాం.గతనెలలో అధికార పార్టీ నాయకులు పాఠశాలకు వచ్చి నాతో పాటు బాణావత్ ఇందిర, యంగ్రాతి పుల్లమ్మ, లావూరి సత్యలను దౌర్జన్యంగా బయటకు పంపించారు. కనీసం పాఠశాల హెచ్ఎం, విద్యాశాఖాధికారులకు చెప్పినా ఫలితం లేకపోయింది. వైఎస్సార్ సీపీ సానుభూతిపరులమనే పేరుతో వంట ఏజెన్సీ బాధ్యతల నుంచి తొలగించారు.

-మంగమ్మ, జయంతిపురం..

కక్ష కట్టి తొలగించారు..



వీరులపాడు మండలం జయంతిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత 15 ఏళ్లుగా మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకురాలిగా పనిచేస్తున్నాను. మెనూ ప్రకారం విద్యార్థులకు మంచి భోజనం అందించాను. తాను వైఎస్సార్‌సీపీ సానుభూతిపరురాలిననే కారణంతో నన్ను తొలగించారు. మాకు ఐదుగురు ఆడపిల్లలు. మాలాంటి వాళ్లకు అన్యాయం చేయడం తగదు.

- మాలాజీ మాధవి, జయంతి

సమాచారం లేకుండా తొలగించారు..



కొన్నేళ్లుగా నేను ఐతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వాహకురాలిగా పని చేస్తున్నాను. వేతనాలు తక్కువైనా విద్యార్థులకు భోజనం పెడుతున్నామనే సంతోషంతో పనిచేస్తున్నాం. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం అకారణంగా ఏజెన్సీ నిర్వహణ నుంచి తొలగించింది.

- సరస్వతి, ఐతవరం

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం..



రాజకీయ కారణాలతో చిరుద్యోగులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే సహించేది లేదు. ఇప్పటికే మధ్యాహ్న భోజనం, బుక్ కీపర్‌లను తొలగించారు. అకారణంగా తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలి లేకుంటే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం.

- కటారపు గోపాల్, సీఐటీయూ నాయకుడు, నందిగామ

ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన ఎర్రకాలువ

ముందుకు సాగని మురుగు



రైతుబజారు వద్ద ఎర్రకాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి ముందుకు సాగని మురుగునీరు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణ నడిబొడ్డు నుంచి ప్రవహిస్తున్న ఎర్రకాలువ వ్యర్థాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు తమ గృహాల్లో ఉపయోగించిన వ్యర్థాలతోపాటు ఎర్రకాలువకు ఆనుకున్న ఉన్న స్థానిక ప్రభుత్వాస్పత్రి వారు, మరో ప్రైవేటు ఆస్పత్రి వారు ఉపయోగించిన వ్యర్థాలను కూడా ఎర్రకాలువలో పడేస్తుండటంతో రోజురోజుకు ఎర్రకాలువ ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలతో నిండిపోతోంది. ఫలితంగా ఎగువ ప్రాంతం నుంచి ప్రవహిస్తూ చెరువు అలుగులోకి చేరాల్సిన మురుగు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. తద్వారా ఎర్రకాలువ నుంచి వచ్చే మురుగు కంపుతో పరిసర ప్రాంతాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాక నీటి ప్రవాహం నిలిచిపోవడంతో దోమలు వృద్ధి చెంది ఎర్రకాలువ దోమలకు ఆవాసంగా మారింది. ఆస్పత్రుల వ్యర్థాలను కూడా ఎర్రకాలువలో పడవేడయడంతో మందుల, వ్యర్థాల కారణంగా వెలువడే తీవ్ర దుర్వాసనను భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దోమల కారణంగా రాత్రివేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్న తమకు ఆస్పత్రుల వ్యర్థాల నుంచి వచ్చే కంపును భరించలేకపోతున్నామని ఎర్రకాలువ కట్ట వాసులు చెబుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పట్టణం గుండా ప్రవహించే ఎర్రకాలువ, వేపలవాగుపై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు వాటిలో పెరిగిపోతున్న వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు. ఎర్రకాలువలో మెడికల్, ప్లాస్టిక్ వ్యర్థాలను పడేసేవారిపై కఠినచర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

అధ్వానంగా పారిశుద్ధ్యం



జయంతిపురం పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు



బలుసుపాడులో అన్నవరం వెళ్లే రహదారి పక్కనున్న చెత్తకుప్పలు

జగ్గయ్యపేట: మండలంలోని పలు గ్రామాలలో పారిశుద్ధ్య పరిస్థితి అధ్వాన్నంగా మారింది. గ్రామాల్లో పారిశుద్ధ్య మెరుగుదలకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ప్రచారం చేస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం ఈ కార్యక్రమాన్ని తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారు. గతనెల 31 నుంచి ఈనెలతొమ్మిది వరకు పదిరోజుల పాటు పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ చేపట్టినప్పటికీ గ్రామాల్లో పారిశుద్ధ్యం ఏమాత్రం మెరుగుపడలేదు. డ్రైన్‌లలో పూడిక తీత, తాగునీటి ట్యాంక్‌ల క్లోరినేషన్‌తోపాటు రోడ్డు పక్కనున్న చెత్తచెదారాలను తొలగించడం లేదు. దీంతో ఆయా గ్రామాలలో అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. జయంతిపురంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల వద్ద చిన్నపాటి వర్షానికే పరిసరాలలోకి వర్షపు నీరు చేరి దుర్గంధం వెదజల్లుతుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బలుసుపాడులోని అన్నవరం వెళ్లే రహదారిలో నివాసాల సమీపంలోనే వ్యర్థాలు, చెత్తాచెదారాల కారణంగా దుర్గంధం వెదజల్లుతుండటంతో ముక్కుమూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆప్రాంతవాసులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గోతులను పూడ్చరూ!



ముక్త్యాల రోడ్డులో అగ్రహారం వద్ద రోడ్డు పడిన భారీ గొయ్యి

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట నుంచి ముక్త్యాలకు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి గుంతలమయంగా మారి అధ్వాన్నంగా మారింది. సుమారు ఎనిమిది కిలోమీటర్ల మేర రహదారి అధ్వాన్నంగా మారడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతూ ప్రయాణికులు అవస్థలుపడుతున్నారు. రహదారిపై రెండు, మూడుడడుగుల మేర పలు చోట్ల గుంతలు పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఈ రహదారిలో వందల సంఖ్యలో లారీలు, ట్రాక్టర్‌లు, ఆటోలు, పలు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ముక్త్యాల గ్రామంలో వేంచేసియున్న భవానీ ముక్తేశ్వరస్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులు కూడా ఈరోడ్డులోనే వెళ్లాల్సి ఉంది. ఈ రహదారిపై గుంతలు ఏర్పడటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నామని ద్విచక్ర వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రహదారిపై పడిన గుంతల రహదారికి మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రకృతి కన్నెర్ర.. ప్రభుత్వ నిరాదరణ

- అధిక వర్షాలకు దెబ్బతిన్న పెసర పంట
- తీవ్ర నష్టాల్లో రైతులు



జుజ్జూరులో రోటోవేటర్‌తో పెసర పంటను తొలగిస్తున్న రైతు

వీరులపాడు: ఒకపక్క ప్రకృతి కన్నెర్ర.. మరో పక్క ప్రభుత్వ నిరాదరణ.. వెరసి పెసర సాగు చేసిన రైతులకు కన్నీరు మాత్రమే మిగిలింది. అధిక వర్షాలతో వరుణుడు పెసర రైతులకు తీరని నష్టాలను మిగిల్చితే...ఆదుకుంటారని నమ్మి ఓట్లేసి గెలిపించుకున్న ప్రభుత్వం నుంచి ఆదరణ కరువవ్వడంతో తమకు ఇక దిక్కెవరని రైతులు వాపోతున్నారు. వరుణుడి కరుణతో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండుతాయనే నమ్మకంతో కొందరు రైతులు పెసర పంటను సాగుచేయగా, తీరా పంట చేతికందే సమయంలో ప్రకృతి కన్నెర చేయటంతో రైతులంతా పూర్తిగా నష్టాల ఊబిలో కూరుకుపోయారు. అధిక వర్షాలకు పంటలకు చీడపీడలు, తెగుళ్లు వ్యాపించటంతో చేసేదేమి లేక ట్రాక్టర్లతో దున్ని పంటను తొలగిస్తున్నారు.

11 వేల ఎకరాలలో పెసర సాగు..

నందిగామ నియోజకవర్గంలోని వీరులపాడు, కంచికచర్ల మండలాలలో రైతులు 11వేల ఎకరాలలో ఈ ఏడాది పెసర పంటను సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. గడిచిన 20 రోజులుగా వాతావరణంలోని మార్పుల కారణంగా కురిసిన అధిక వర్షాలకు పెసర పంటకు చేటు చేసింది. పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు కురవటంతో పూత, పిందె పూర్తిగా రాలిపోయిందని దీంతో దిగుబడులు వచ్చే ఆశ కూడా లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. పంట పూర్తిగా దెబ్బతినడంతో రోటోవేటర్లతో పెసర పంటను తొలగిస్తున్నామని ప్రభుత్వమే తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

సీజన్ ప్రారంభమైన అందని రైతు భరోసా..

వ్యవసాయ సీజన్‌కు ముందు రైతులకు పెట్టుబడి ఖర్చులను అందించేందుకు గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుభరోసా కింద ఏటా రూ.13,500 అందించేవారు. నాలుగేళ్లపాటు రైతుభరోసా నిధులు అందడం రైతులకు ఒకింత ఊరటగా ఉండేది. అయితే ఈ ఏడాది ఆగస్టు నెల వచ్చినా కూడా రైతు భరోసా అందలేదు. ఎన్నికల సమయంలో రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20వేలు ఇస్తామని టీడీపీ కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినప్పటికీ .. అధికారం చేపట్టి రెండు నెలలవుతున్నా ఆ ఊసే లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు.

దయనీయంగా కౌలు రైతుల పరిస్థితి..

వ్యవసాయ భూములున్న రైతుల పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్నా కౌలు రైతుల పరిస్థితి మాత్రం అత్యంత దయనీయంగా మారింది. ఎకరం రూ.15 వేల నుంచి 20 వేల వరకు కౌలు వెచ్చించి పంటలు సాగు చేసినా చీడపీడలు, తెగుళ్ల కారణంగా పెసర పంటను నష్టపోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రభుత్వ నిరాదరణ కారణంగా పంటను మధ్యలోనే తొలగించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పంటలు మధ్యలోనే తొలగిస్తే భూయజమానులకు కౌలు ఎలా చెల్లించాలో కూడా అర్థం కావటం లేదని కంట తడి పెడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆదుకోకుంటే ఆత్మహత్యలే తమకు శరణ్యమని వాపోతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి..



మాది జుజ్జూరు గ్రామం. ఎకరం రూ.18 వేల చొప్పున ఎనిమిది ఎకరాలు కౌలుకు తీసుకుని పెసర పంట సాగు చేపట్టాను. ఇప్పటికే రూ. రెండు లక్షలకు పైగా సాగు ఖర్చులయ్యాయి. అధిక వర్షాల కారణంగా పూత, పిందె రాలిపోయింది. దీనికి తోడు తెగుళ్లు కూడా వ్యాపించాయి. చేసేది లేక రోటోవేటర్‌తో పెసర పంటను తొలగించాను. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

- షేక్ జాఫర్, జుజ్జూరు

నివేదికలు పంపాం..

మండలంలో పెసర పంట సాగు చేసిన రైతుల పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది. ఈ ఏడాది కురిసిన అధిక వర్షాల కారణంగా పెసర పంట దెబ్బతింది. దెబ్బతిన్న పంట వివరాలను సేకరించి నివేదికను ఉన్నతాధికారులకు పంపించాం. రైతులను ఆదుకునేందుకు అన్ని రకాలుగా కృషి చేస్తున్నాం.

- రమేష్, వ్యవసాయాధికారి

వైభవంగా మహాదుర్గ అమ్మవారి విగ్రహావిష్కరణ



మహా దుర్గ విగ్రహావిష్కరణలో కోగంటి సత్యం, ఆలయ నిర్వాహకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): శ్రీవిజయ దుర్గాదేవి ఆలయం 7వ వార్షికోత్సవం మహోత్సవాలు జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగాయి. ఆషాఢ మాస అమావాస్య ఆదివారంనాడు పుట్టింటివారి ఆధ్వర్యంలో ఉదయం చండీ హోమంతో ఉత్సవాలు ప్రారంభంకాగా 11.30 గంటలకు 18 అడుగుల మహా దుర్గ అమ్మవారి విగ్రహావిష్కరణ జరిగింది. మధ్యాహ్నం 1.45 గంటలకు అమ్మవారికి మహా కుంభం, అనంతరం తల్లి, శక్తుల విగ్రహ ప్రతిష్ట, అన్న సంతర్పణ కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి గణాచారిణులతో అమ్మవారి పవళింపు సేవ జరిగింది. గురువు కరుమూరి దాసు మాట్లాడుతూ.. ఉత్సవాల్లో భాగంగా సోమవారం మృత్యుంజయ హోమం, అనంతరం విఘ్నేశ్వర, శివలింగం, నాగపడగల ప్రతిష్టలు జరుగుతాయని తెలిపారు. అన్న సంతర్పణ, మహా హారతులు ఉంటాయని పేర్కొన్నారు. మంగళవారం స్వామి, అమ్మవార్ల గ్రామ ఊరేగింపు నిర్వహిస్తామని చెప్పారు. విగ్రహ దాత కోగంటి సత్యనారాయణ, గణాచారి కీర్తి భవానీ, సగురుపల్లి లక్ష్మి, నమ్మి దుర్గాసాయి, గణాచారి రాజశ్రీ, జానిరాజు, ప్రభుదాసు, కాళిదాసు, పూజారి గోవింద్ పాల్గొన్నారు.

స్వతంత్ర బీసీ ఉద్యమ నిర్మాణం అవసరం

సామాజిక ఉద్యమకారుడు వైకే

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆధిపత్య కులాలు, రాజకీయ పార్టీలను ఎన్నికల్లో బలపరుస్తూ బీసీ సంఘాలు సామాజిక న్యాయానికి, రాజ్యాధికారానికి తీరని నష్టం కలిగిస్తున్నాయని న్యాయవాది వైకే అన్నారు. ఈ నేపథ్యంలో స్వతంత్ర బీసీ ఉద్యమ నిర్మాణం జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో బీసీ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వైకే మాట్లాడుతూ స్వతంత్ర బీసీ ఉద్యమ ఆవశ్యకతను వివరించారు. స్వతంత్ర బీసీ ఉద్యమం లేకుండా బీసీలకు ఎప్పటికీ రాజ్యాధికారం దక్కదన్నారు. ఇకనైనా అన్ని బీసీ సంఘాలు స్వతంత్ర ఉద్యమ నిర్మాణం వైపుగా సాగాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమ నిర్వహణకు 21 మందితో ఆర్గనైజేషన్ కమిటీ ఎన్నుకున్నారు. ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సెప్టెంబర్ 14, 15 తేదీల్లో రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి బీసీ ప్రతినిధులు పీవీ రమణయ్య, వీరవల్లి శ్రీనివాసరావు, కె.సుబ్రహ్మణ్యం, పితా రమేష్, పెండ్యాల నారాయణ, భాస్కర్ గౌడ్, సూరిబాబు, బొబ్బిలి సూర్యనారాయణ, సి.శంకర్, రేణుకా దేవి, శిరీష, సీహెచ్ పద్మ, కడియం సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.